



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్



పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలుపుతున్న ఎంపిటిసి భర్త నాగరాజు

'గడపగడప'లో నిరసనాగ్రహం

◆పెట్రోల్ మీదపోసుకుని ఎంపిటిసి భర్త ఆత్మహత్యాయత్నం

◆ఎమ్మెల్సీ గో బ్యాక్ అంటూ నినాదాలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలంలో శుక్రవారం నాడు ఎమ్మెల్సీ మొహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికార పార్టీ నేతల నుంచే నిరసన వ్యక్తం అయ్యింది. తమకు సమాచారం ఇవ్వకుండా గ్రామంలో ఎలా కార్యక్రమం నిర్వహిస్తారంటూ చిలమత్తూరు-3 ఎంపిటిసి నాగమణి భర్త నాగరాజు పెట్రోల్ మీద పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈయనతో పాటు మరికొందరు ఎంపిటిసిలు సైతం ఎమ్మెల్సీని అడ్డుకుని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... చిలమత్తూరు మండల పరిధిలోని తుమ్మలకుంట, వడ్డిచన్నంపల్లి గ్రామాల్లో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇక్బాల్ ఆధ్వర్యంలో తలపెట్టారు. ఈ గ్రామాల పరిధిలో ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన తమకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం ఎలా నిర్వహిస్తారంటూ వైసిపి ఎంపిటిసిలు నాగమణి, కవిత, సానామ్‌ఉన్నీసాలు ఎమ్మెల్సీని అడ్డుకున్నారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ ప్రతి ఒక్కరికీ తాను ఫోన్ చేసి ఎలా సమాచారం ఇవ్వగలనని, సమాచారాన్ని వాట్సాప్ ద్వారా పంపానని వారికి తెలియజేసే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొనాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. గ్రామంలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఎంపిటిసిలు ఎమ్మెల్సీ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది జరుగుతుండగానే తుమ్మలకుంట క్రాస్ నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ఎమ్మెల్సీ కారు ఎక్కుతుండగా ఎంపిటిసి భర్త నాగరాజు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడే ఉన్న గ్రామస్తులు, రూరల్ సిఐ వేణుగోపాల్‌లు అడ్డుకుని, పెట్రోల్ బాటిల్‌ను లాక్కొని పక్కకు విసిరేశారు. అసమ్మతి నేతలు 'ఎమ్మెల్సీ గో బ్యాక్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసనల మధ్యనే ఎమ్మెల్సీ తుమ్మలకుంటలో గడపగడపకు కార్యక్రమం కొనసాగించారు. కాగ హిందూపురం అధికార పార్టీలో గత కాలంగా కొనసాగుతున్న అసమ్మతి జ్వాలలు ఈ ఘటనలో మరోసారి బహిర్గతం అయ్యాయి.

వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌లో

ఛార్జిషీట్ దాఖలు



◆జెసిపిఆర్, అస్మిత్‌రెడ్డితోపాటు 12 మందిపై అభియోగాలు నమోదు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బిఎస్-3 వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌లో మరో కదలిక వచ్చింది. తప్పుడు పత్రాలతో బిఎస్-3 వాహనాలను బిఎస్-4 రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఇది వరకే అనంతపురం, తాడిపత్రి పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో తాడిపత్రి పోలీసులు 830 పేజీలతో ఛార్జిషీట్‌ను శుక్రవారం నాడు తాడిపత్రి జ్యూడిషయల్ మెజిస్ట్రేట్ కోర్టులో తాడిపత్రి పోలీసులు దాఖలు చేశారు. ఇందులో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆయన తనయుడు అస్మిత్‌రెడ్డి, ఆయన అనుయాయుడు జఠాధర సంస్థ ప్రతినిధి సి.గోపాల్‌రెడ్డితోపాటు 12 మందిపై అభియోగాలను మోపుతూ అందజేశారు. బిఎస్-3 వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మొత్తం 35 కేసులు నమోదై ఉన్నాయి. ఇందులో నిందితులుగానున్న వారందరి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులను చెన్నైలోనున్న అశోక్ లైల్యాండ్ సంస్థకు లావాదేవీలు సాగినట్టు పోలీసులు ఛార్జిషిట్‌లో పేర్కొన్నారు. ఛార్జిషీట్‌లో దాఖలుతో ఈ కేసు విచారణలో పురోగతి వేగవంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 151 వాహనాలను నిబంధనలకు తుక్కు కింద కొనుగోలు చేసి, వాటిని బిఎస్-4గా రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలపై గతంలోనే జెసి.ప్రభాకర్‌రెడ్డి, జెసి.అస్మిత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిలపై కేసులు నమోదై ఉన్నాయి. వీరు ఈ కేసుల్లో జైలుకు సైతం వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చి ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో జరిగిన అవతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఎన్‌పోర్సుమెంట్ డైరెక్టరేట్ కూడా దృష్టిసారించింది. కార్పొరేట్ సంస్థ అయిన అశోక్ ల్యాలెండ్ సంస్థ ప్రమేయంపైనా దర్యాప్తు సంస్థ విచారణ చేపడతామని కొద్ది రోజుల క్రితమే ప్రకటించియుంది. ఈ నేపథ్యంలో తాడిపత్రిలో విచారణ చేపట్టిన పోలీసులు ఛార్జిషీట్‌ను దాఖలు చేయడం చర్చనీయాంశమైంది. ఇంకా అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లోనూ దీనిపై విచారణ సాగుతోంది. ఈ విచారణలో ఎటువంటి అంశాలు వెలుగులోకి వస్తాయన్నది చూడాల్సి ఉంది.

ఐదు వాహనాలు తుక్కు కింద విక్రయం

అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగిన వాహనాలను సీజ్ చేశారు. ఈ వాహనాలను కొనుగోలు చేసిన వారు తాము ఆర్థికంగా నష్టపోతామని తమకు ఈ వాహనాలను తుక్కు కింద అమ్ముకుని అయినా కొంత వరకు ఆర్థిక నష్టాన్ని పూడ్చుకుంటామని ఐదుగురు వ్యక్తులు న్యాయస్థానాన్ని కోరారు. ఈ ఐదు వాహనాలను విక్రయించుకోవడానికి న్యాయస్థానం అనుమతినిచ్చింది. దర్యాప్తు సంస్థల సమక్షంలోనే చేయాలని న్యాయస్థానం సూచన మేరకు పోలీసు అధికారులు, రవాణా అధికారులు సంయుక్తంగా ఈ పనిని ఇటీవలనే పూర్తి చేశారు. ఇక దర్యాప్తు కూడా వేగవంతమై ఛార్జిషీట్ కూడా దాఖలవడంతో కేసు విచారణ మరింత వేగవంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్ కేసులు అటు రాష్ట్రాన్నే కాకుండా దేశాన్ని కుదిపేశాయి. ఇప్పుడు ఈ కేసు విచారణ, చర్యలు ఏ రకంగా ఉంటాయని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇది మరెన్ని మలుపులు తిరగనుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు.

మహిళలపై హింసను నిర్మూలిద్దాం

◆చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

◆కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళలపై జరుగుతున్న హింస నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో "ప్రపంచ స్త్రీలపై జరిగే హింస వ్యతిరేక పక్షోత్సవాల" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై జరిగే హింసకు ప్రధాన కారణం పురుషాధిక్యత, పితస్వామ్యవ్యవస్థ అన్నారు. సమాజంలో పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఐసిడిఎస్ పరిధిలో ఉందని తెలిపారు. బాలింతలు, గర్భిణులకు మంచి పౌష్టిక ఆహారం అందించే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీలపై జరుగు హింసకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నేటికీ కూడా దేశంలో చాలామంది స్త్రీలకు గహహింస చట్టంపై సరైన అవగాహన లేదని దీని వల్ల చట్టాలను ఉపయోగించుకోలేక హింసకు గురవుతున్నారన్నారు. హింస నుంచి విముక్తి పొందడానికి పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

పుట్టపర్తిలో కోర్టు భవనాలను కలెక్టర్ బసంత్ కుమార్ పరిశీలించారు. పుట్టపర్తిలోని జూనియర్ సివిల్ జడ్జికోర్టు ప్రాంగణంలో జడ్జి ఛాంబర్‌లో కోర్టు భవనాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన మరమ్మతులపై జడ్జి రాకేష్ కలెక్టర్‌కు వివరించారు. వర్ష తీవ్రత మూలంగా కోర్టు గదుల్లో లీకేజీ మూలంగా ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ఆయా గదుల వారీగా చేపట్టాల్సిన మరమ్మతులపై ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ బాలాజీ నాయక్, ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో కీలక పరిణామం

అసమ్మతి ముఖ్యనేతను కలిసిన ఎమ్మెల్సీ ఇక్బాల్


ప్రజాశక్తి-హిందూపురం



విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసమ్మతి వర్గంలో కీలక నేత అయిన కొండూరు వేణుగోపాల్‌రెడ్డిను పార్టీ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై సుధీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. అనంతరం బయటకు వచ్చిన వారు మాట్లాడుతు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఐక్యంగా పని చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి జెండాను ఎగురవేస్తామన్నారు. ఎమ్మెల్సీ, కొండూరు కలవడంతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది.

నవరత్నాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి : ఎమ్మెల్యేలు



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

పెనుకొండ : అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్నాలతో లబ్ధి చేకూరుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగర పంచాయతీ లోని 20 వ వార్డు పరిధిలోని కొండాపురం, మంగాపురం గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. అదేవిధంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన పలు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్ ఫరూక్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, ఎంపీడీవో శివశంకరప్ప, తహశీల్దార్ స్వర్ణలత, వైసిపి నాయకులు పొగాకు రామచంద్ర, ఎంపీపీ గీతారామ్మోహన్ రెడ్డి, టౌన్ కన్వీనర్ నరసింహ, కౌన్సిలర్లు భాస్కర్ నాయక్, రఘునాథ్ రెడ్డి, తయూబ్, రామాంజి, గణేష్, బోయ బాబు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలోనివేపరాల గ్రామ సచివాలయ పరిధిలోని చిన్నక్కగారిపల్లిలో శుక్రవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానికఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనప్పచ ఏవో లక్ష్మి ప్రియచ ఎంపిపి జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్. ఫయాజ్ అలీతో పాటు నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గాండ్ల వారి పల్లి పంచాయతీలోని బి కొట్టాలచ కమ్మవారి పల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రతి గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్, ఇందుకూరు నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సేవ్యానాయక్, తిరుమల బాయ్‌తో పాటు ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

వైసిపి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం : టిడిపి



ఆందోళనలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె, తదితరులు

కొత్తచెరువు. వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందిని ప్రజలు ఈ పాలనపై పూర్తిగా విసుగు చెందారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని మైల్ సముద్రం నారేపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పల్లె పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రతి ఇంటింకి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు వెంకటరమణప్ప, రిటైర్డ్ టీచర్ నాగేంద్రప్రసాద్, మాజీ ఎంపీటీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : వైసీపీ పాలన చూసి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ ప్రజలు విసిగిపోతున్నారని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 25వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమినేని ప్రసాద్నాయుడు, గడ్డం సూరి, చీమలరామాంజి, గాలిప్రకాష్, అంకన్న, గంగాధర్, రామాంజి. శ్రీనివాసులు, కాయల రామాంజి, జయరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: మండల పరిధిలోని ఉడుములకుర్తి పంచాయతీలోని ఏలగల బైలు, సోములవాండ్లపల్లి, బి. కొత్తపల్లి గ్రామాలలో టిడిపి నాయకులు శుక్రవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముబారక్, పరిశీలకులు మనోహర్ నాయుడు, వడ్డే బాబు, ఓబుల్ రెడ్డి, జయచంద్ర, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తచెరువు : ఈనెల 27న పెనుకొండలో జరిగే ఆంధ్రప్రదేశ్ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు రంగం యూనియన్ అధ్యక్షులు బాబావలి, పుట్టపర్తి కార్యదర్శి గౌస్, కోశాధికారి గంగాధర్ కోరారు. ఈ మేరకు వారు స్థానికనాలుగు రోడ్ల కూడలిలో ఆటో యూనియన్ డ్రైవర్లు, నాయకులతో కలిసి జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, ఆదినారాయణ, నాగార్జున, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : ఈ నెల 27న పెనుకొండలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు జిల్లా మహాసభల కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. పుట్టపర్తి, కొత్తచెరువు, యనమలపల్లి ,పెడపల్లి, ఆటో కార్మికులతో కలసి వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా అధ్యక్షులు పెడపల్లి బాబా, సిఐటియు పట్టణ కార్యదర్శి గౌస్‌లాజం,కోశాధికారి పైపల్లి గంగాధర్, ఆటో యూనియన్ నాయకులు రామాంజినేయులు, ఆదినారాయణ, నాగార్జున, మనోహర్, ఆటో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఈనెల 27న పెనుకొండలో జరిగే ఏపీ ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఆయూఖాన్, ట్రాన్స్‌పోర్టు రంగం యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్.రఫీలు పిలుపునిచ్చారు. పట్టణంలోని పీఆర్టీ ఆటోస్టాండ్ వద్ద మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అదినారాయణ, చాంద్‌బాషా, మోహన్, రఫీక్, రియాజ్, రఫిక్, రవి, రామాంజి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి : ఏపి రైతుసంఘం

ప్రజాశక్తి- తాడిమర్రి

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న దళిత రైతు భాస్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలకేంద్రంలోని రైతు కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ స్థితి గతులను, ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబపోషణ, వ్యవసాయం, ఇతర అవసరాల నిమిత్తం దాదాపు రూ.8.50 లక్షలు అప్పులు చేశాడని అప్పులకు వడ్డీలు కట్టలేక మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని ఈసందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు నాయకులకు తెలిపారు ఈసందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ ఆత్మహత్యచేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలన్నారు. మృతుని ముగ్గురు ఆడపిల్లలకు ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మారుతి, మండల అధ్యక్షులు పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..?

ప్రజాశక్తి - నంబుల పూలకుంట



భూమిమీద పడిన విద్యుత్‌తీగ

మండల పరిధిలోని వెలిచలమల పంచాయతీ సచివాలయం రోడ్డు దగ్గర గోపాలపురం తండా మార్గమధ్యలో విద్యుత్ తీగ భూమికి సమీపంలో వేలాడుతోంది. ఆ వైరు తగిలి గతంలో కొన్ని పశువులు కూడా ప్రమాదానికి గురయ్యాయి. వర్షం ఎక్కువ వస్తే ఈ ప్రాంతంలో నీరు ఎక్కువగా నిలువ ఉండే అవకాశం ఉంది. దీంతో ఈ మార్గం మీదుగా వెళ్లే వారు ప్రమాదం బారిన పడే ప్రమాదం ఉంది.రాత్రి సమయంలో రైతులు పొలాల వద్దకు ఈ మార్గం మీదుగా వెళుతుంటారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ఈ విద్యుత్ తీగను గమనించకుండా తాకితే ప్రమాదం బారిన పడక తప్పవదు. ప్రమాద కర స్థితిలో ఉన్న తీగను విద్యుత్ అధికారులు చూసీ కూడా పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకర స్థితిలో ఉన్న ఈ విద్యుతీగను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యనములపల్లి జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి కుల్లాయప్ప నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిశుభ్రతపై పిల్లలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య, ఆరోగ్య కార్యకర్త పరిమళ, ఆశా కార్యకర్తలు రాధ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రథమ చికిత్సలే చేస్తున్నాం'...

లేపాక్షి : తాము రోగులకు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందిస్తున్నామని మండలంలోని ఆర్ఎంపిలు చెప్పారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక వైద్యాధికారి చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆర్ఎంపి యూనియన్ అధ్యక్షులు గోవింద్ రాజు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తాము ప్రథమ చికిత్సలు మాత్రమే చేస్తున్నామన్నారు. తాము ప్రభుత్వ వైద్య విధానాలకు వ్యతిరేకంగా పనిచేయడం లేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా తాము పనిచేస్తే ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి యూనియన్ సభ్యులు ఆంజనేయులు, ప్రథమ చికిత్స నిర్వాహకులు శ్రీనివాస్, బాషా, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి పూల శ్రీనివాసరెడ్డి పరామర్శ

కదిరి టౌన్ : రూరల్ పరిధిలోనికొలేపల్లికి చెందిన మొటుకుపల్లి ఎంపిటిసి కుమారుడు లోకేష్‌కు ప్రమాదంగా కాలికి గాయమైంది. విషయం తెలుసుకున్న సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ఓబులదేవరచెరువు: మండలంలోనిగౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988- 89వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 17 వేల రూపాయలు విలువ జేసే స్కానర్, ప్రింటర్‌ను హెచ్ఎం విజయలక్ష్మికి అందజేశారు.

యోగాతో మానసిక ఆనందం

బుక్కపట్నం : యోగ ద్వారా మానసిక ఆనందాన్ని పెంపొందించుకోవచ్చునిసత్యసాయి భక్తురాలు షీనా, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు చంద్ర మోహన్, దస్తగిరి, ఓబయ్య, ఆనంద్, నాగేంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు .

బదిలీ ఉద్యోగికి సన్మానం

నల్లచెరువు : మండలంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న నందిని ఉద్యోగోన్నతిపై అమడగూరు మండల డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ అయింది. ఈ సందర్భంగా ఎంపీపీ రమణారెడ్డి, ఆధ్వర్యంలో బదిలీ అధికారి నందినిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మంజుల, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఆదిమూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి మైక్‌సెట్ వితరణ

ఓబులదేవరచెరువు: మండల కేంద్రానికి సమీపంలో ఎం.కొత్తపల్లి బండపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయానికి నల్లమాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు తుమ్మల షామీర్‌బాషా మైక్ సెట్, బ్యాటరీ సామాగ్రి అందజేసినట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు. ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉండటానికి వీటిని అందజేసినట్లు తెలిపారు. అనంతరం అన్నదానం సత్రంలో 290 మంది అయ్యప్పస్వామి మాలధారణ భక్తులకు భోజనాల భిక్ష ఏర్పాటు చేసారన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పిటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, ఎంపిడిఒ పోలప్ప, ఇఒఆర్‌డి రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ గజ్జల శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచి ఎద్దులవెంకటరంగారెడ్డి, మైనారిటీనాయకులు బాబాఫక్రుద్దీన్, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు

వైభవంగా జ్యోతుల ఉత్సవం

మడకశిర : భక్తరహళ్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జ్యోతుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా భూతప్పల ఉత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సిఐ సురేష్ బాబు, ఎస్ఐ నాగేంద్ర, వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు అవగాహన

పుట్టపర్తి రూరల్ : ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లాలోని దిశా మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని కర్ణాటక నాగేపల్లి ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు అవగాహన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గుడ్ టచ్, బడ్ టచ్ పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో దిశా కానిస్టేబుల్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం

తలుపుల: మండల పరిధిలోని గజివారిపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న పోలిమేరమ్మ విగ్రహాన్నిదుండగులు గురువారం రాత్రి ధ్వంసం చేసి పక్కనే ఉన్న పొలాలలో పడేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మక్బూల్ బాషా, కదిరి రూరల్ సీఐ శంకర్ నాయక్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు అందించాలి

తలుపుల: మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అగ్రీ అడ్వైజరీ ఛైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, ఎడిఎ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సమావేశంలో రైతులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయ పరికరాలైన పైపులు, డ్రిప్, స్ప్రింక్లర్స్, జిప్సం, స్ప్రేయర్లు తదితర వాటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఒ షాదాబ్, హెచ్ఒ నవీన్, ఎఇఒ రహంతుల్లా, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో అయ్యప్పమాలాధారులు

ధర్మవరం టౌన్ : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఇంటిలో శుక్రవారం అయ్యప్పస్వామి అంబలం మహా పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పమాలధారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు రైల్వేగేటు మూసివేత

హిందూపురం : హిందూపురం నుంచే పెనుకొండ వైపు వెళ్లే రహదారిలో గల చాకర్లపల్లి రైల్వే గేటు మరమ్మతుల కోసం శనివారం మూసి వేస్తునట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పనులు జరుగుతాయన్నారు. ఈ రహదారిలో తిరిగే వాహనదారులు ఈవిషయం గమనించాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

సోమందేపల్లి : మండల పరిధిలోని గుడిపల్లి పంచాయతీలోని బీసీ కాలనీలో సిసిరోడ్డు, డ్రయినేజీ ఏర్పాటు పనులకు సర్పంచ్ గిరిజమ్మ నాగరాజు రావ్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. సచివాలయానికి కేటాయించిన నిధులలో మండలంలో మొట్టమొదటి పనులు కల్పించిన పంచాయతీ గుడిపల్లి గ్రామపంచాయతీ అని ఇఒఆర్‌డి నాగరాజు రావు తెలిపారు. 5 లక్షల నిధులతో ఈ పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వైసీపీ నాయకులు అమర్నాథ్, కడపల్లి సోమశేఖర్, కేశవ, శంకరప్ప మరియు సచివాలయ సిబ్బంది భారతి, బాలకృష్ణ, అశ్వర్థ, వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

కొత్తచెరువు : పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి తెలిపారు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి, ఆర్థిక ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు 2023 - 24 సంవత్సరానికి అభివృద్ధిపై ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు గ్రామాల అభివద్ధికి ప్రభుత్వం నుండి వచ్చిన నిధులను 70శాతం పంచాయతీలకు, 15శాతం మండల పరిషత్తుతో, మరో 15 శాతం జిల్లా పరిషత్ ఈ నిధులను ఖర్చు చేయాలన్నారు గ్రామపంచాయతీలో 40 శాతం నిధులు ఖర్చు చేయాలన్నారు నవరత్నాల్లో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు నీటి సదుపాయం రోడ్లు డ్రైనేజీ లాంటి పనులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నటరాజు , హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, సర్పంచులు రత్నమ్మ, అలివేలమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి కావాలి : కలెక్టర్



హౌసింగ్ అధికారులను ఆదేశిస్తున్న జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి ఇల్లు వెంటనే గ్రాండింగ్ కావాలని కలెక్టర్ బసంత కుమార్ ఆదేశించారు. పట్టణంలోని పోతులనాగేపల్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. అధికారులతో ఇళ్ల నిర్మాణాలు, లబ్దిదారుల సమస్యలు తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరు నాటికి ప్రతి ఒక్క ఇల్లు గ్రౌండింగ్ కావాలని అధికారులను ఆదేశించారు. పోతుల నాగేపల్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో 2098 ఇళ్లు మంజూరు కాగా 99 నాన్‌స్టార్టెడ్, 273 బేస్మెంట్ స్థాయి కన్నా తక్కువలో, 1948 బేస్మెంట్ స్థాయిలో, 118 ఆర్ఎల్ స్థాయిలో, 36 ఆర్సీస్థాయిలో ఉన్నాయని అన్నారు. మరో 64 పూర్తయ్యాయని తెలిపారు. మరో లేఅవుట్‌లో 2118 ఇళ్లు మంజూరు కాగా 685 నాన్ స్టార్టెడ్, 947 బేస్మెంట్ స్థాయి కన్నా తక్కువలో, 459 బేస్మెంట్ స్థాయిలో, 15 ఆర్ఎల్ స్థాయిలో, 9 ఆర్సీ స్థాయిలో ఉన్నాయని మరో మూడు పూర్తయ్యాయని తెలిపారు. నెలాఖరుకు ప్రతి ఇంటి నిర్మాణం మొదలు పెట్టాలన్నారు. ఈనెల 21వతేదీ నాటికి లేఅవుట్‌లో విద్యుత్, నీటి సరఫరా సిద్ధంగా ఉండాలని, విద్యుత్ సౌకర్యం త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ నాగరాజు, డీఈ మునీశ్వరాయుడు, ఏఈ బాలాజీ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ యోగేశ్వరిదేవి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో మెరిసిన 'మంగళకర' విద్యార్థులు

పుట్టపర్తి రూరల్. : ఈనెల 6 ,7న జరిగిన ఎస్కే యూనివర్సిటీ అంతర్ కళాశాల గ్రూప్ సి వాలీబాల్ పోటీలలో మంగళకర డిగ్రీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలను ఉరవకొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో నిర్వహించగా ఇందులో 26 జట్లు పాల్గొన్నాయి. వారిలో మంగళకర విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మంగళాకర విద్యార్థులను కరస్పాండెంట్ సురేష్ కుమార్ , ఎఒ జయచంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్ బాబు, పీడీ శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభా విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

పార్టీ బలోపేతానికి కృషి : బికె

ప్రజాశక్తి - పెనుకొండ



కమిటీ సభ్యులతో బికె

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నగర పంచాయతీకి చెందిన టిడిపి అనుబంధ సంఘాల కమిటీలను ఆయన ప్రకటించారు. బిసి సెల్ అధ్యక్షులుగా గొల్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రభాకర్, ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా రామలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా రాము, ఎస్‌టి సెల్ అధ్యక్షులుగా బాలు నాయక్, ప్రధాన కార్యదర్శిగా విజయకుమార్ నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బి.కె.పార్థసారథి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు అశ్వర్థనారాయణ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామలింగ, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి హుజూర్, సీనియర్ నాయకులు బొక్కసంపల్లి రామకృష్ణప్ప పాల్గొన్నారు.

వికలాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతులు దినోత్సవ సందర్భంగా శుక్రవారం స్థానిక జీవనజ్యోతి. విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభవంతులు అన్ని రంగాలలోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి, ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ, ఎటిఎల్ కృష్ణ, ఎస్‌టిఎల్ కేశవమూర్తి, ఎంపిపి జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సచివాలయ సిబ్బందికి శిక్షణ

తనకల్లు : మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలలో జరగబోయే అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేసే విషయంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోటపల్లి, గేమే నాయక్ తండా, చీకటి మానిపల్లి, గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూల నరసింహులు. ఈవోఆర్డీ ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

క్లాప్‌ను వందశాతం అమలు చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్లాప్ కార్యక్రమాన్ని హిందూపురం పురపాలక సంఘంలో వంద శాతం అమలు చేద్దామనిమున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ కార్యక్రమంపై సోమవారం నుంచి వారం రోజుల పాటు చేపట్టే కార్యక్రమాలపై శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు వార్డు నోడల్ అధికారులు, సచివాలయ శానిటరీ సెక్రేటరీలు, మేస్త్రీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇ నాగేంద్ర, ఇన్‌ఛార్జి శానిటరి ఇన్స్‌పెక్టర్ నెట్టిగల్లు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కనగానపల్లి : మండల పరిధిలోని ముత్తవకుంట్ల గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన హరి కుటుంబసభ్యులను టిడిపి మండల కన్వీనర్ యాతం పోతలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నెట్టెం వెంకటేష్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందనాఏనరు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భానుగోట నరసింహులు, సీనియర్ నాయకులు ముకుంద నాయుడు, పతకమూరి ఆంజనేయులు, సర్పంచి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థినులు చదువుతో పాటు సంస్కారాన్ని పెంపొందించుకొని నవ సమాజ నిర్మాణంలో పునరంకితం కావాలని అదనపు జిల్లా జడ్జి శైలజ పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ మానహ హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిజాయితీతో వ్యవహరించి తమ చదువులను కొనసాగించాలన్నారు. తమ ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ యశోదా దేవి, సిఐ ఇస్మాయిల్, ఎపిపి ఇందాద్, న్యాయవాదులు నాగరాజు రెడ్డి, సుదర్శన్, సిద్దు, శివశంకర్, కళావతి, నవేరా, ఫణిభూషన్, అధ్యాపకులు వెంకటేష్, కార్యాలయ సూపరింటెండెంట్ నరసింహులు, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.



.సమావేశంలో మాట్లాడుతున్న ఎడిజె శైలజ



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపుమాపి, యుతకు ఉపాధి, ఉద్యోగ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్, సీడాప్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు 16 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 668మంది నిరుద్యోగులు హాజరుకాగా వారిలో ప్రతిభ కనబరచిన 245 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత చదువుతో పాటు నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా మెరుగైన ఉపాధిని ఉద్యోగ అవకాశాలను పెంపొందించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య, తహశీల్దార్ యుగేశ్వరి, మున్సిపల్ వైస్ చైర్మన్ యర్రగుంట భాగ్యలక్ష్మి, ఎంప్లాయ్ మెంట్ ఆఫీసర్ కళ్యాణి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఖయ్యూం. సీడాప్ జెడిఎం సూర్యనారాయణ, ఎపిఎం లక్ష్మీనారాయణ, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్, వైసిపి విద్యార్థి విభాగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్ నాథరెడ్డి, పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ భద్రత నిర్వహణపై సమీక్ష

పుట్టపర్తి రూరల్.: పుట్టపర్తిలోని శ్రీ సత్య సాయి బాబా విమానాశ్రయం నందు బీసీఏఎస్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం 2 సార్లు విమానాశ్రయ భద్రత నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం కలెక్టర్ బసంత్ కుమార్, జిల్లా అదనపు ఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్ కలిసి విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను, విమానాలను హైజాక్ కాకుండా కాపాడే 'యాంటీ హైజాకింగ్ మాక్ ఎక్సర్సైజ్' ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తొందర్లోనే ఈ విమానాశ్రయాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా కమర్షియల్ ఏర్పాటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. దీని ద్వారా ఈ చుట్టుపక్కల ప్రాంతం ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు.. అలాగే ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌కు కూడా స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, డిసిఆర్‌బి సిఐ ఘంటా సుబ్బారావు, జిల్లా ఫైర్ ఆఫీసర్‌తో పాటు తహశీల్దార్ నవీన్ కుమార్, ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ ఆఫీసర్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రామచంద్రారెడ్డికి నివాళి

పెనుకొండ : మాజీ మంత్రి ఎస్. రామచంద్రారెడ్డి వర్ధంతిని టిడిపి నాయకురాలు సవితమ్మ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ, ఎస్ ఆర్ నాగరాజు రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, రాంపురం సర్పంచి శ్రీనివాసులు నాగార్జున,రవికుమార్, గణేష్ తదితరులు మాజీ మంత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ~ నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు ద్వారా రామాంజనేయులు, క్రిష్టప్ప, బాబుల్ రెడ్డి, నాయకులు శ్యాంప్రసాద్, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మాజీ మంత్రి ఎస్ రామచంద్రారెడ్డి వర్ధంతిని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహ కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకట రమణ, ఆంజనేయులు, నరసింహులు, క్రిష్టప్ప, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బత్తలపల్లి : అనంతపురం కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి సమీపంలోని ఓ డాబా వద్ద శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో యువకుడు మృతిచెందాడు, ఎస్ఐ శ్రీహర్ష తెలిపిన వివరాలు.. కదిరి పట్టణం మూర్తిపల్లికి చెందిన ఓబిలేసు కుమారుడు చెక్క అనిల్(29)కు చిన్నతనం నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఈ నేపథ్యంలో గురువారం ఇంటి నుంచి ఎవ్వరికి తెలియకుండా బయటికి వచ్చాడు. దీంతో అతని కుటుంబసభ్యులు అనిల్ ఆచూకి కోసం వెతుకుతున్నారు. ఇదే సమయంలో శుక్రవారం తెల్లవారుజామున 2 : 45 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం అనిల్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో అనిల్ మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎఒ కార్యాలయంలో చోరీ

అమడగూరు : మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.కార్యాలయంలో ఉన్న ప్రింటర్‌ను చోరీ చేశారని వ్యవసాయ అధికారిణి వీర జోష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసు నిందితులు అరెస్టు

కదిరి టౌన్ : ఈనెల 6న జరిగిన హత్య కేసు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ మధు తెలిపారు. వాషింగ్ మిషన్ నీటి విషయంలో జరిగిన ఘర్షణలో జరిగిన పద్మాబాయి హత్య కేసుకు సంబంధించిన నిందితులు భూక్యాప్రకాష్‌నాయక్, భూక్య వేమననాయక్‌కు అరెస్టు చేసినట్లు సిఐ చెప్పారు. శుక్రవారం మదనపల్లి రోడ్డు ఫ్లైఓవర్ వద్ద నిందితులు ఉన్నట్లు సమాచారం అందడంతో వారిని అరెస్టు చేసి వారి నుండి హత్యకు ఉపయోగించిన కత్తి, బండరాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

చిత్రావతి నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పుట్టపర్తి రూరల్ : చిత్రావతి నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పుట్టపర్తి సాయి నగర్ కు చెందిన చెరుకూరి నాగేంద్ర (70) చిత్రావతి నదిని దాటుతూ గురువారం గల్లంతయ్యాడు. అదే ప్రాంతంలో శుక్రవారం మృతదేహమై కన్పించినట్లు పుట్టపర్తి అర్బన్ సిఐ బాలసుబ్రమణ్యం తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు

హిందూపురం : పట్టణంలోని పరగి రోడ్డులో జరిగిన చోరీ కేసులో ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.7లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సిఐ ఇస్మాయిల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వన్‌టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు వివరాలను వెల్లడించారు. ఇటీవల పరగి రోడ్డులో జరిగిన దొంగతనం కేసును చేధించడానికి వన్ టౌన్ సిఐ ఆధ్వర్యంలో ప్రత్యేకబృందం ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందంలో తనతో పాటు ఎస్ఐ రఫీక్, సిబ్బంది భాస్కర్ నాయుడు, వెంకట్రామిరెడ్డి, నరేష్, అనీల్ కుమార్ ఉన్నారన్నారు.